క్లుప్తంగా

వాటర్ ప్లాంట్‌లు తనిఖీ



పెనమలూరు: పోరంకిలో పరిధిలోని మంచినీటి వాటర్ ప్లాంట్లను శనివారం తాడిగడప మున్సిపాలటీ కమిషనర్ షేక్ నజీర్ తనిఖీ చేశారు. వాటర్ ప్లాంట్లలో నీటి శాంపిల్స్ సేకరించారు. నీటి నాణ్యత, అనుమతి పత్రాలు ఉన్నాయా లేదా, వాటర్‌ప్లాంట్ పరిశుభ్రత తదితర విషయాలను పరిశీలించారు. వాటర్ ప్లాంట్లకు అనుమతులు లేనివారిని వెంటనే సంబంధిత శాఖల నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశించారు. అనుమతులు లేని పక్షంలో వాటర్ ప్లాంట్‌లు మూసివేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ కిరణ్, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

టెక్నాలజీతో నాణ్యమైన నిర్మాణాలు



పెనమలూరు: సివిల్ ఇంజినీరింగ్‌లో ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి నాణ్యమైన నిర్మాణాలు చేపట్టాలని కాంటర్ టెక్నాలజీ సాఫ్ట్‌వేర్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ కె.నాగు సూచించారు. పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో గత వారం రోజులుగా సివిల్ విభాగంలో జరిగిన శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్ రంగంలో విద్యార్థులు నైపుణ్యం పెంచుకొని సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు మాట్లాడుతూ విద్యార్థులు ఆధునిక టెక్నాలజీని అవగాహన చేసుకొని నైపుణ్యం సాధించాలని సూచించారు. కార్యక్రమంలో సివిల్ విభాగాధిపతి డాక్టర్ వి.జగదీష్, కోఆర్డినేటర్ డాక్టర్ కోగంటి శ్యామ్ ప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.18.50 లక్షలతో డ్రెయినేజీ నిర్మాణం



హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కోడూరుపాడులో రూ.18.50 లక్షల వ్యయంతో డ్రెయినేజీ నిర్మాణం చేపడుతున్నట్లు వైస్ ఎంపీపీ చందు రమాదేవి, వైఎస్సార్ సీపీ నేత చందు శ్రీనివాసరావు శనివారం తెలిపారు. గ్రామంలోని రైల్వే గేటు నుంచి బొడ్డురాయి సెంటర్ వరకు ఈ సీసీ డ్రెయినేజీ నిర్మించనున్నట్లు వివరించారు. మండల పరిషత్ నిధుల నుంచి రూ.18.50 లక్షలు మంజూరు కావడంతో శరవేగంగా నిర్మాణ పనులు చేస్తున్నట్లుగా తెలిపారు. ఈ మేరకు డ్రెయినేజీ పనులను వారు పరిశీలించారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



పెనమలూరు: చిన్నారులు ఆరోగ్యంగా ఎదగాలంటే పోషకాహారం తప్పనిసరిగా ఇవ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎల్.సులోచన రాణి పేర్కొన్నారు. యనమలకుదురులో శనివారం 8వ రాష్ట్రీయ పోషణ మాసం-2025లో భాగంగా గ్రామంలోని తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీ దశ నుంచి ఆరోగ్యం పట్ల తగిన జాగత్తలు తీసుకోవాలన్నారు. పోషకాహారం, వైద్య పరీక్షలు, టీకాలు క్రమం తప్పకుండా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ వజ్రకుమార్, డాక్టర్ హారిక, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి



పాయకాపురం(విజయవాడరూరల్): ముస్లిం, మైనార్టీ వర్గానికి కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చాలని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా డిమాండ్ చేశారు. కండ్రికలో ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర కార్యాలయంలో 27 మందితో రాష్ట్ర కార్యవర్గం ఎంపిక, నూతన సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా నాగుల్‌మీరా మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం మైనార్టీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ఆ పార్టీల ప్రతినిధులకు వినతి పత్రాల రూపంలో అందజేసి పోరాడుతామన్నారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిల్డర్ నాగుల్ మీరా, కమిటీ సలహాదారు షేక్ హిమావళి కమిటీ ప్రతినిధులు రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు నాగుల్ మీరాను, నూతన కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు.

వాత్సల్యరూపిణీ.. ఐశ్వర్య ప్రదాయినీ

- శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు
- వైభవంగా దేవీ శరన్నవరాత్రులు

కంకిపాడు: దేవీ శరన్నవరాత్రులు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజైన శనివారం అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కంకిపాడు, ప్రొద్దుటూరు, ఉప్పలూరు, మంతెన, ఈడుపుగల్లు, మద్దూరు గ్రామాల్లో కొలువుదీరిన అమ్మవారిని భక్తులు దర్శించుకుని భక్తిపారవశ్యం చెందారు. ఉప్పలూరు గ్రామంలో అభయాంజనేయ స్వామి వారికి భవానీ మాలధారులు అభిషేకాలు జరిపించారు.

యనమలకుదురులో..

పెనమలూరు: యనమలకుదురు శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో శనివారం అమ్మవారిని శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించి పూజలు చేశారు. పోరంకి గంగానమ్మ గుడి, షిర్డీ సాయిబాబా మందిరం, చోడవరం శ్రీనాగేంద్ర స్వామి ఆలయం, పెదపులిపాక విజయ రాజరాజేశ్వరిదేవి ఆలయాల్లో అమ్మవారు శ్రీలలితా త్రిపుర సుందరీగా పూజలందుకున్నారు. అలాగే యనమలకుదురు శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవిని కాత్యాయనీదేవిగా అలంకరణ చేసి చండీహోమం, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

గన్నవరం: స్థానిక సొసైటీపేటలోని శ్రీగాయత్రి మందిరంలో అమ్మవారు లలితా త్రిపుర సుందరీగా భక్తులకు దర్శనమిచ్చారు. పాతగన్నవరంలో శ్రీలక్ష్మీతిరుపతమ్మ వారు లలితాదేవిగా పూజలందుకున్నారు. సామూహిక కుంకుమార్చనలు, శ్రీలలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారికి తామర పూలతో పూజలు చేశారు.



మద్దూరులో లలితా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు



ఉయ్యూరులో లలితాదేవిగా విజయదుర్గమ్మ



పోరంకిలో లలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణ



గన్నవరంలో అమ్మవారు



నున్నలో లలితా త్రిపుర సుందరీ

అలరించిన కూచిపూడి నృత్యం

ఉయ్యూరు: తోట్లవల్లూరు రోడ్డులోని శ్రీ విజయ దుర్గా భవానీ దేవి ఆలయంలో లలితా త్రిపుర సుందరీ దేవికి కుంకుమార్చనతో భక్తులు పూజలు చేశారు. ఉయ్యూరు శివాలయంలో అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. శివాలయంలో నర్తన గణపతి కళాక్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. కళాకారులను శివాలయం ఈఓ ప్రసాద్, చైర్మన్ నందకిషోర్, పాలక వర్గ సభ్యులు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

ఆధ్యాత్మిక వాతావరణం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో శనివారం అమ్మవారు శ్రీలలితా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో, బోడపాడు శ్రీ కోదండ రామాలయంలో, సాయిబాబా మందిరంలో, చినకంచి శ్రీకామాక్షి ఆలయంలో అమ్మవార్లు లలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో పూజలు అందుకున్నారు. అమ్మవార్లకు కుంకుమ పూజలు, రాజశ్యామల చండీ హోమం నిర్వహించారు. పి.నైనవరం, మంగళాపురం, అప్పారావుపేట గ్రామాల్లో అమ్మవారిని శ్రీలలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో భక్తులు దర్శించుకున్నారు. అయా ఆలయ కమిటీలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశాయి.

లలితాదేవిగా పేరంటాలమ్మ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవార్లు లలితా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దాతల సహకారంతో ఆలయ ప్రాంగణం, అమ్మవార్లను రకరకాల పుష్పాలతో సుందరంగా అలంకరిచారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ అవతారం విశ్వంలోని పంచభూతాలను సూచిస్తుంది. ఆదిమ శక్తి స్వరూపంగా, జ్ఞానాన్ని, ఐశ్వర్యాన్ని, సౌభాగ్యాన్ని ప్రసాదించే దేవిగా భక్తులకు నమ్మకం. రాత్రి ఆలయంలో ప్రదర్శించిన ఆంధ్ర నాట్యం భక్తులను అలరించింది.



లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో పేరంటాలమ్మ

జీఎస్టీ - 2.0 రేట్లపై అవగాహన

హనుమాన్‌జంక్షన్ రూరల్: కేంద్ర ప్రభుత్వం నూతనంగా అమలులోకి తీసుకువచ్చిన జీఎస్టీ - 2.0 రేట్ల ప్రకారమే వ్యాపారులు విక్రయాలు సాగించాలని తూనికలు, కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్ బి.వి.హరిప్రసాద్ సూచించారు. స్థానిక ఏలూరురోడ్డులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో 'నవరించిన జీఎస్టీపై తూనికలు, కొలతల శాఖ పాత్ర' అనే అంశంపై కిరాణా, క్లాత్ వర్తకులతో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వస్తు సేవల పన్ను (జీఎస్టీ)పై కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సవరణలు ఈ నెల 22వ తేది నుంచి అమలుల్లోకి వచ్చాయని, వాటికి అనుగుణంగా వ్యాపారులు నడుకోవాలని సూచించారు. జీఎస్టీ సంస్కరణల్లో భాగంగా 12, 28 శాతం శ్లాబు పన్నులను తొలగించాలని, అన్ని రకాల వస్తువులపై 5 లేదా 12 శాతం మాత్రమే జీఎస్టీ అమలవుతుందని తెలిపారు. దీనికి అనుగుణంగా ఎంఆర్పీ ధరలు తగ్గుతాయని పేర్కొన్నారు. ప్రజలకు మేలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ రేట్ల మేరకు మాత్రమే వస్తువుల అమ్మకాలు సాగించాలని, లేనిపక్షంలో తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ ఎస్.యు.భాను ప్రసాద్, హనుమాన్‌జంక్షన్ కిరాణా వర్తకుల సంఘం అధ్యక్షుడు రాగిపిండి లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కిరాణా, క్లాత్ మర్చంట్స్‌తో మాట్లాడుతున్న తూనికలు, కొలతల శాఖ అధికారులు

రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్‌లో ఎన్టీటీపీఎస్ ప్రతిభ

ఇబ్రహీంపట్నం: టేబుల్ టెన్నిస్ పోటీల్లో ఎన్టీటీపీఎస్ జట్టు రాష్ట్ర స్థాయిలో ప్రథమస్థానం సాధించిందని సీఈ శివ రామాంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24 నుంచి కాకినాడ డీఎస్‌ఏ స్టేడియంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ క్రీడా విభాగంలో ఓపెన్ సింగిల్స్‌లో డీఈఈ ఎస్.ఆదినారాయణ ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. అన్ సీడెడ్ ఎంట్రీతో ఒక్క ఓటమి లేకుండా ఐదు రౌండ్లలో ప్రత్యర్థులపై విజయం సాధించారని చెప్పారు. ఆదినారాయణను ఆంధ్రప్రదేశ్ విద్యుత్ కార్పొరేషన్స్ స్పోర్ట్స్ అధికారి వడివేలు ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ టీం కెప్టెన్‌గా నియమించి అభినందించారు. టీమ్ ఈవెంట్‌లో సైతం ఎస్ఎం షఫీ, ఆదినారాయణ, గోవిందయ్య, మహమ్మద్ రఫీ పాల్గొని ఉత్తమ ప్రతిభతో విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచారు. వారిని సీఈ శివ రామాంజనేయులు అభినందించారు.



ప్రతిభ చూపిన ఇబ్రహీంపట్నం ఎన్టీటీపీఎస్ జట్టు

కనకదుర్గమ్మకు నృత్య నీరాజనం

విజయవాడకల్చరల్: దసరా మహోత్సవాల సందర్భంగా కనకదుర్గానగర్‌లోని కళావేదికపై శనివారం ప్రదర్శిస్తున్న నృత్య కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. శనివారం నాటి కార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాక తమిళనాడు, కర్నాటక నుంచి వచ్చిన కళాకారులు కనకదుర్గమ్మకు నృత్య నీరాజనాలు సమర్పించారు. ఎస్.సామ్రాజ్యం తాళం భజనతో ఆకట్టుకున్నారు. భక్తి రంజని కార్యక్రమంలో పి.సాయి సాత్విక, వి.సీతామహాలక్ష్మి, వి.లతానాగమణి, నాగేశ్వరమ్మ, ఆర్.సత్యనారాయణ భక్తి గీతాలను ఆలపించారు. కూచిపూడి నృత్య కార్యక్రమంలో భాగంగా సుదీక్ష, పార్వతి, వి.భారతి, ఎస్.సౌందర్య, పూజశ్రీ, జి.విజయగౌరి, సురేష్ గోపి, హైదరాబాద్‌కు చెందిన వైభవి, ప్రభాకర్, రేణుక బృందాలు, కర్నాటకకు చెందిన విద్యాధరి, ఎం.లలితాదేవి, తిరుపతికి చెందిన లక్ష్మీపతి, ఎల్.తేజస్విని, అన్నమయ్య, రామదాసు కీర్తలను ఆలపించారు.



నృత్యాలు ప్రదర్శిస్తున్న కళాకారులు

ఆకట్టుకున్న జీక్షిత నృత్యం

బాల నృత్య కళాకారిణి జీక్షిత(5) జయజయ నటరాజ, మూషిక వాహన, అదిగో భద్రాద్రి కీర్తనలకు నృత్యాలను అభినయించింది. కార్యక్రమ నిర్వాహకులు కళాకారులకు జ్ఞాపికలను ప్రశంసా పత్రాలను అందజేశారు. చిన్నారులకు అమ్మవారి దర్శనానికి అనుమతించారు. వారికి వాహన సౌకర్యం కల్పించాలని ఈఓ ఆదేశించినప్పటికీ దిగువ స్థాయి సిబ్బంది పట్టించుకోకపోవడంతో వారికి తిప్పలు తప్పలేదు.

ఈ-క్రాప్ నమోదు వేగవంతం చేయాలి

ఆర్డీఓ హెలా షారోన్

ఉయ్యూరు/పమిడిముక్కల: పంటల ఈ-క్రాప్ నమోదు వేగవంతంగా పూర్తి చేయాలని ఉయ్యూరు ఆర్డీఓ హెలా షారోన్ సూచించారు. ఉయ్యూరు, పమిడిముక్కల మండలం తాడంకి గ్రామాల్లో జరుగుతున్న ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను శనివారం ఆమె పరిశీలించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదు నూరు శాతం పూర్తి చేయాలన్నారు. రెవిన్యూ, వ్యవసాయశాఖ అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఈ-క్రాప్‌కు రైతులు సహకరించాలని కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సమర్థవంతంగా విధులు నిర్వర్తించి ఈ-క్రాప్ నమోదు నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు.



పమిడిముక్కల మండలం తాడంకిలో ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఆర్డీఓ హెలా షారోన్

30 లోపు నమోదు చేసుకోవాలి

గన్నవరం రూరల్: మండలంలోని సూరంపల్లి, ముస్తాబాద, సావరగూడెం గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదును మండల వ్యవసాయాధికారి కె.శివప్రసాద్ శనివారం పరిశీలించారు. త్వరగా పంట నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే 80శాతం పంట నమోదు చేశామని, మిగిలిన 20శాతం కూడా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ నెల 30వ తేదీ లోపు పంట నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు.

పంటల నమోదు తప్పనిసరి

పెనమలూరు: రైతులు వారు పండించే పంటలను తప్పనిసరిగా నమోదు(ఈ-క్రాప్) చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ పేర్కొన్నారు. ఆమె శనివారం వివరాలు తెలుపుతూ మండలంలో 7,457 ఎకరాల్లో పంటల సాగు జరుగుతోందని తెలిపారు. అయితే మిగితా గ్రామాలతో పోలిస్తే చోడవరం, వణుకూరు, పోరంకి, పెనమలూరు గ్రామాల్లో రైతులు ఈ-క్రాప్ నమోదులో ముందుకు రావాలని సూచించారు. ఈ-క్రాప్ నమోదు జరిగితేనే పంటల కొనుగోలు ప్రభుత్వం చేపడుతుందన్నారు. రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి పంటల నమోదు చేసుకోవాలని సూచించారు.



చోడవరం గ్రామంలో పంట నమోదు చేస్తున్న దృశ్యం

వీఐపీ టైం స్లాట్‌లో ఆలయ ప్రాంగణంలో రద్దీ

చెకింగ్ పాయింట్ల వద్ద తోపులాట

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వీఐపీ టైం స్లాట్ మార్పులతో సామాన్య భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని వీఐపీల కోసం తెల్లవారుజామున 5 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు, సాయంత్రం 7 గంటలకు ప్రత్యేక టైం స్లాట్‌లను ఏర్పాటు చేశారు. అయితే ఉదయం, సాయంత్రం టైం స్లాట్‌లకు ఓ మోస్తరుగా డిమాండ్ ఉండగా, మధ్యాహ్నం 3 గంటల టైం స్లాట్‌కు డిమాండ్ ఎక్కువగా ఉంది. పోలీసు, రాజకీయ నాయకులతో పాటు నగర ప్రముఖుల సిఫార్సులతో మధ్యాహ్నం టైం స్లాట్‌కు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఓం టర్నింగ్, డోనర్ సెల్‌తో పాటు గాలిగోపురం పాయింట్ల వద్ద రద్దీ అధికంగా ఉంటోంది. వీఐపీ క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి గంటకు పైగా సమయం పడుతోంది. దీని కారణంగా కొండపైకి వృద్ధులు, దివ్యాంగుల వాహనాలను సైతం నిలిపివేస్తున్నారు. శనివారం పలువురు వృద్ధులు, దివ్యాంగులు సాధారణ క్యూలైన్‌లోనే అమ్మవారిని దర్శించుకోగా, మరి కొందరు ఘాట్‌రోడ్డు మీదగా నడుచుకుంటూ వచ్చి వీఐపీ క్యూలైన్‌లోకి చేరుకుంటున్నారు.



ఓం టర్నింగ్ చెకింగ్ పాయింట్ వద్ద భక్తుల తోపులాట

భవానీ భక్తులకు విశ్రాంతి శిబిరం ఏర్పాటు

హనుమాన్‌జంక్షన్ రూరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని విజయవాడ దుర్గమ్మ గుడికి కాలి నడకన తరలివెళుతున్న భక్తులకు కోసం బాపులపాడు మండలం బొమ్ములూరులో విశ్వహిందూ పరిష త్ జాతీయ ట్రస్టీ, పారిశ్రామిక వేత్త పుట్టగుంట సతీష్ కుమార్ ఉచిత అన్నప్రసాద వితరణ, విశ్రాంతి శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆయన ఫ్యాక్టరీ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉత్సవ మండపం వద్ద అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి, అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. మానవ సేవే మాధవ సేవగా భావించి ఏటా భక్తులకు అన్నదానం చేస్తున్నామని పుట్టగుంట తెలి పారు. ఈ శిబిరంలో ఉదయం, సాయంత్రం అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఏర్పాట్లతో పాటుగా వృద్ధులు, మహిళల కోసం ప్రత్యేకంగా విశ్రాంతి, వైద్య సదుపాయాలను కల్పిస్తున్నట్లు వివరించారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

పెనమలూరు: వణుకూరు గ్రామంలో ఓ వ్యక్తిపై మరోవ్యక్తి దాడి చేయడంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. సీహెచ్ మహాలక్ష్మి, భర్త కృష్ణ వణుకూరులో ఉంటున్నారు. అయితే అదే గ్రామానికి చెందిన సీహెచ్ రాజు అనే వ్యక్తి మద్యం సేవించి వచ్చి పాతగొడవల కారణంగా మహాలక్ష్మిని దూషించాడు. దీంతో మహాలక్ష్మి భర్త కృష్ణ నా భార్యను ఎందుకు తిడుతున్నావని రాజును మందలించాడు. దీంతో రాజు కర్రతో కృష్ణ తలపై కొట్టడంతో తీవ్ర గాయమైంది. బాధితుడిని విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్పారు. మహాలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు గుర్రం జాషువా జయంతి సభ

విజయవాడకల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సృజనాత్మక సమితి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఆదివారం ఉదయం 11 గంటలకు కవి కోకిల గుర్రం జాషువా 130వ జయంతి వేడకలను నిర్వహిస్తున్నట్లు సృజనాత్మక సమితి సీఈవో ఆర్.మల్లికార్జునరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ కనకదుర్గా ప్రసాద్, మీసాల లక్ష్మణ్, కె.గురమ్మలకు నగదు పురస్కారం, జ్ఞాపికలను ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో పర్యాటక శాఖామంత్రి కందుల దుర్గేష్‌తో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం గన్నవరం సెక్షన్ పరిధిలో ఆదివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల ఈఈ రామమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కొత్తపేట, చెంచులకాలనీ, ఎయిర్ పోర్ట్ సిటీ, దుర్గాపురం, ఆశ్రమం ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

• జై భవానీ.. జైజై భవానీ

ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజైన శనివారం అమ్మవారు శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. జై భవానీ.. జైజై భవానీ నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. సాయంత్రం నిర్వహించిన ఆది దంపతుల నగరోత్సవం, కళాకారుల నృత్యాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ











నేడు ఉచిత రేబిస్ వ్యాక్సిన్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడులోని పశువైద్యశాలలో ఆదివారం పెంపుడు, వీధి కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్ వేయనున్నట్లు వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ డాక్టర్ జి.రామకృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

DOCUMENTS LOST

I, GADDAM MAHALAKSHMI W/o Late GADDAM PANDURANGA RAO resident of Door No. 2-124, Ramavarappadu, Vijayawada, NTR District Andhra Pradesh. I have lost my Original **GIFT SETTLEMENT DEED LINK** document bearing No. 3769/1935 during the recent floods on 1-9-2024 and in spite of my best efforts I am unable to trace the said document are lost beyond recovery. If anyone finds it please inform the above said address or **contact: 93467 35939**

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెనమలూరు డివిజన్
90105 77706 (ఉయ్యూరు)
99122 20539 (పెనమలూరు)
90102 10382 (గన్నవరం)
Office mail : sakshiads@gmail.com